క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

దెందులూరు: వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు విజయానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఆదివారం ఎంపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు కామవరపుకోట ఉపసర్పంచ్ మేడూరి రంగబాబు, కొత్తూరు, జలపావారిగూడెం నాయకులు, కార్యకర్తలు కలిశారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు గృహ సందర్శనకు అధిక సమయం కేటాయించాలని, నేరుగా ప్రజలను కలిసి ప్రభుత్వ పథకాలు వివరించి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయానికి సహకరించాలన్నారు. ఎన్నికలకు కొద్ది సమయం మాత్రమే ఉందని, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వా లన్నారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన

దెందులూరు: గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి 67వ వార్షికోత్సవ ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా అచ్చమ్మ తల్లి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో మహా అన్నసమారాధన నిర్వహించారు. ఏలూరు, దెందులూరు, భీమడోలు, పెదవేగి, పెదపాడు, కామవరపుకోట, ఏలూరు రూరల్ మండలాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు అమ్మవారి ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావును ఆలయ కమిటీ సత్కరించారు. రెండు రాష్ట్రాల నుంచి అమ్మవారి ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు పోలీసులు, వైద్య, పంచాయతీ, విద్యుత్, ఉద్యోగులకు ఆలయ కమిటీ తోట అచ్చియ్య, పూజారి శ్రీనివాసరావు, ఏనుగు రామకృష్ణ, అంబటి లక్ష్మణరావు, తోట వెంకన్న, గంటా కోటేశ్వరరావు, గంటా సుబ్బారావు, పెద్దిశెట్టి నాని, పెద్దిశెట్టి బసవయ్య, పూజారి రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు ఆలయ కమిటీ నిర్వహించి, ఆలయ పూజారిని సత్కరించారు.

నూకాలమ్మ సేవలో మేయర్ నూర్జహాన్



నూకాలమ్మ ఆలయంలో పూజ చేస్తున్న మేయర్ నూర్జహాన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేటలోని నూకాలమ్మవారి ఆలయంలో అమ్మవారిని నగర మేయర్ షేక్ నూర్జహాన్ ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. అమ్మవారి కరుణాకటాక్ష వీక్షణాలు నగర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు మేయర్ నూర్జహాన్‌కు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జనపరెడ్డి కనకశ్రీ రాజేశ్వరి కృష్ణ, వెల్లంకి రాజు, జనపరెడ్డి కృష్ణ, గొంతిన రామకృష్ణ, బావిశెట్టి కేశవ, నక్కా నాగేశ్వర రావు, తనకాల లక్ష్మాజీ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవదుర్గ పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో రామకోటి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యులచే మౌన ధ్యానం, భక్తి గీతాలాపన, హరే రామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. దుర్గాసప్తశతి బృందం ప్రతినిధులు అమ్మవారి ఆవాహన అష్టోత్తర సహస్రనామ పూజలు, నవదుర్గ పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం లలితా సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి స్వామి వారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. దివాకరుని వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వరశర్మ విశేష పూజలు నిర్వహించగా, శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పేదలకు సొంతింటి కల సాకారం

- నాడు అద్దె ఇంటిలో అవస్థలు
- నేడు సొంతింటిలో సంతోషంగా జీవనం
- సీఎం జగనన్న మేలును మరువలేమంటున్న లబ్ధిదారులు



కొవ్వలిలో ఇంటి పట్టా ఇస్తున్న అప్పటి మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి (ఫైల్)

దెందులూరు: గతంలో ఒకే ఇంటిలో రెండు, మూడు కుటుంబాలు అసౌకర్యంగా జీవనం. కొందరు అద్దె ఇళ్లల్లో గడిపిన వైనం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో పేద, బడుగు, బలహీన వర్గాల ఇబ్బందులు చూశారు. విన్నారు. ఆనాడే అక్క చెల్లెమ్మలందరికీ వారి పేరున ఇళ్ల పట్టాలు, రుణాలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే దివంగత వైఎస్సార్

దెందులూరు నియోజకవర్గంలో పట్టాల పంపిణీ వివరాలు

మండలం	లబ్ధిదారులు
దెందులూరు	1,960
పెదపాడు	2,998
ఏలూరు రూరల్	2,582
పెదవేగి	4,356

ఎంజాయిమెంట్ సర్టిఫికెట్ అందుకున్న వారి వివరాలు

మండలం	అర్హులు
దెందులూరు	3,521
పెదపాడు	276
ఏలూరు రూరల్	363
పెదవేగి	3,859

ఇళ్ల నిర్మాణం వివరాలు

మండలం	మంజూరు	పూర్తయినవి	లేఅవుట్లు
దెందులూరు	3,283	1,812	41
ఏలూరు రూరల్	2,742	757	24
పెదపాడు	3,863	1,250	49
పెదవేగి	5,684	2,744	64



దెందులూరులోని జగనన్న కాలనీ



తనయుడుగా ఆయన ఆశయాల సాధనకు నడుం బిగించారు. పేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించారు. లబ్ధిదారులు ఒక్కరికీ రూ. 2 లక్షలు ఇంటి నిర్మాణానికి రుణాన్ని మంజూరు చేశారు. దీంతో వేగంగా ప్రతి గ్రామంలో కొత్త జగనన్న కాలనీలు ఊళ్లను తలపించేలా రూపుదిద్దుకున్నాయి. అద్దె ఇళ్లకు, ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాల జీవనానికి ప్రజలకు స్వస్తి చెప్పారు. రెండు గదులు, వరండా, కిచెన్, బాత్‌రూం, శ్లాబ్, ఇంటి స్థలంలోనే ప్రహరీ సౌకర్యవంతంగా నిర్మించిన ఇంటిని లబ్ధిదారులు నిర్మించుకున్నారు. జగనన్న ఇళ్లు, కాలనీలు అద్భుతంగా, సుందరంగా, చూడముచ్చటగా నిర్మితమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం పక్కా రోడ్ల నిర్మాణం, తాగునీరు, వీధి లైట్లు, విద్యుత్ సౌకర్యం జగనన్న కాలనీల్లో ఏర్పాటు చేసింది.

పట్టాలు ఇవ్వకుండా కోర్టుకు వెళ్లి అడ్డుకున్న టీడీపీ నేతలు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని మహాయజ్ఞంలా భావించి ఇళ్ల పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజల్లో మంచి పేరు వస్తుందని టీడీపీ నాయకులు దుష్ట బుద్ధితో కోర్టులకు వెళ్లి దెందులూరు నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. టీడీపీ కుట్రలను తిప్పికొట్టి దెందులూరు నియోజకవర్గంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇంకా అర్హులైన వారిని గుర్తించి, వారి దరఖాస్తులు పరిశీలించి స్థలాలు కేటాయించే ప్రక్రియ కొనసాగుతోంది. టీడీపీ కోర్టులో కేసులు వేసి అడ్డుకోకుంటే నియోజకవర్గంలో మరెంతో మందికి ఇళ్ల స్థలాలు కేటాయింపు జరిగేది.







జగనన్న కాలనీలో నిర్మించిన గృహాలు

అర్హులందరికీ ఇళ్ల పట్టాల పంపిణీ



నియోజకవర్గంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తన తండ్రి కొఠారు రామచంద్రరావు సహకారంతో దెందులూరు నియోజకవర్గంలో 19 వేలకుపైగా పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో ఇళ్ల పట్టాలు, విద్య, వైద్యం, రైతు సంక్షేమం తన తొలి ప్రాధాన్యతగా కృషిచేస్తున్నాం. రూ.124 కోట్లు ఇళ్ల నిర్మాణానికి గృహ నిర్మాణ శాఖ ద్వారా నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. – కొఠారు అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్యే, దెందులూరు

శరవేగంగా నిర్మాణాలు



నియోజకవర్గంలో ఇళ్ల పట్టాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం నిబంధనలకు అనుగుణంగా జరిగాయి. ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులందరికీ గృహనిర్మాణ శాఖ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందించాం. స్థలం పొందిన వారంతా త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలి. – ధనుంజయరావు, హౌసింగ్ డీఈ

చాలా సంతోషంగా ఉంది



నాకు వివాహం అయిన దగ్గర నుంచి అద్దె ఇంట్లోనే ఉన్నాను. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి నాకు ఇంటి స్థలం కేటాయించి, నిర్మాణానికి రుణం మంజూరు చేశారు. చాలా సంతోషంగా ఉంది. – గొల్ల దివ్యభారతి, లబ్ధిదారురాలు, కొవ్వలి

నేడు రైల్వే అండర్‌పాస్ ప్రారంభోత్సవం



దెందులూరు వద్ద నిర్మించిన రైల్వే అండర్ పాస్

దెందులూరు: దెందులూరు–అలుగులగూడెం వద్ద నూతనంగా నిర్మించిన రైల్వే అండర్ పాస్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ అండర్‌పాసు నుంచి రాత్రి వేళ అంధకారంలో ప్రయాణం చేయాల్సి ఉంది. బ్రిడ్జి నిర్మించిన రెండు వైపులా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ మార్గం నుంచి ప్రయాణించే రెండు మండలాల ప్రజలు రాత్రివేళ ప్రయాణం ఎలా చేయాలని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సౌకర్యం, అండర్ పాస్ రెండు వైపులా చేయాలని వారు కోరుతున్నారు.

నేడు అడవికొలను రహదారి పనుల ప్రారంభం

నిడమర్రు: రూ 2.5 కోట్లు అంచనా వ్యయంతో బువ్వనపల్లి– అడవికొలను రహదారిలో బీటీ, సీసీ రహదారి పనులను సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడమర్రు, గణపవరం వైఎస్సార్ సీపీ బాధ్యులు పుప్పాల కన్నబాబు, పుప్పాల చినబాబు పాల్గొంటారని సత్యకుమార్ తెలిపారు.

గ్రంథాలయంలో విద్యార్థుల పుస్తక పఠనం

భీమడోలు: భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలులో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు పాల్గొని సామూహిక పుస్తక పఠనంలో పాల్గొన్నారు. తమకు నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసుకుని చదివారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు రామ్మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలి

- ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తా
- సంక్షేమం, అభివృద్ధిపై చర్చకు సిద్ధం
- ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉంది
- ఉద్వేగంగా ప్రసంగించిన ఎమ్మెల్యే వాసుబాబు



నారాయణపురంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు



హాజరైన భీమడోలు, ఉంగుటూరు మండలాల కార్యకర్తలు, నాయకులు

ఉంగుటూరు: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని, ఉంగుటూరు నియోజకర్గంలో విజయం తథ్యమని, మెజారిటీ లక్ష తక్కువ కాకుండా తీసుకురావాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు నాయకులు, కార్యకర్తలకు స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి నారాయణపురంలో పాతూరి శ్రీనివాసరాజు ఐస్ పరిశ్రమ ప్రాంగణంలో భీమడోలు, ఉంగుటూరు మండలాల వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, బూత్ కమిటీ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గత ప్రభుత్వాల కంటే మన వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధే ఎక్కువ అని అన్నారు. సంక్షేమం, అభివృద్ధిపై ఏ గ్రామంలోనైనా ప్రతి పక్షాలతో చర్చకు సిద్ధమని ఆయన అన్నారు. అవినీతికి తావులేకుండా కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా పథకాలు అర్హులందరికీ, అన్ని వర్గాల వారికి అమలు చేశామన్నారు. ప్రజలను ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు పార్టీ కోసం ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలని వాసుబాబు కోరారు.

హామీలన్నీ అమలు చేశాం

ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని వాసుబాబు అన్నారు. అయిదేళ్ల పాలనలో ఒక్క పైసా అవినీతికి పాల్పడలేదని వాసుబాబు ఉద్వేగ భరితంగా అన్నారు. ఈసారి ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా, వారికి అండగా నిలస్తానని వాసుబాబు గంభీర స్వరంతో చెప్పారు. జనసేన పార్టీ కార్యకర్తలను నట్టేట ముంచిన పవన్ కల్యాణ్ ప్రజలకు ఏమి చేస్తారని ఎద్దేవా చేశారు. 95 శాతం ప్రజలకు మేలుచేసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని అన్నారు. ఆదర్శవంతంగా పారదర్శక పాలన అందించిన సీఎం జగన్ ప్రజలను ఓటు అడిగే ధైర్యం ఇచ్చారని అన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వివరించాలని కోరారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జయప్రకాష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వాసుబాబు నిజాయతీగా పని చేశారు. పథకాల లబ్ధిదారులను కలిసి ఓటురూపంలో మార్చుకోవడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ ఓడినా, గెలిచినా ప్రజలతోనే ఉండి సేవలందించిన నిస్వార్థ నాయకుడు వాసుబాబును మళ్లీ గెలిపించుకోవాలని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పార్టీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు మాట్లాడుతూ గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఓటర్లకు పథకాలు వివరించాలని సూచించారు. సచివాలయాల కన్వీనర్ పి. బాలకృష్ణ, ఎం. రాజేష్, పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంటా లక్ష్మణరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు మళ్లగిరి జాన్సన్, కాగుపాడు విజయ్, పార్టీ కైకరం అధ్యక్షుడు నక్క శ్రీను, మలకలపల్లి నాగు మాట్లాడారు. జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జిల్లా నాయకురాలు మంద జయలక్ష్మి, నాయకులు పుప్పాల గోపి, భీమడోలు మండల అధ్యక్షుడు రాయిపాటి సత్యశ్రీనివాస్, దొంతంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణానికి సహకరించాలి



పెదపాడు శివారు గండిచెరువు గట్టులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పెదపాడు ఎస్సై శుభశేఖర్

పెదపాడు : ఏలూరు జిల్లా ఎస్పీ డీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు పెదవేగి ఎస్సై కె శ్రీనివాస్‌కుమార్ ఆధ్వర్యంలో పెదపాడు ఎస్సై శుభశేఖర్ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం రాత్రి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి వైషమ్యాలు లేకుండా ప్రజలు ఓటు వేసుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఎలాంటి సమస్యలు సృష్టించరాదన్నారు. రాజకీయ పార్టీలపై ఉన్న అభిమానంతో ఎదుటి పార్టీల వారిని దూషించరాదని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ఓటును వినియోగించుకునే విషయాల్లో ఎలాంటి ఆటంకాలు సృష్టించరాదని, ఎలాంటి ప్రలోభాలకు గురిచేయరాదన్నారు. గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శుభాకర్ హెచ్చరించారు.

కొమిరేపల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణానికి నిధుల మంజూరు

- ఫలించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కృషి
- జాతీయరహదారిపై రూ. 4 కోట్లతో నిర్మాణం

దెందులూరు: దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో జాతీయ రహదారిపై దెందులూరు మండలం కొమిరేపల్లి వద్ద నూతన బ్రిడ్జి మంజూరైందని ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కొమిరేపల్లి గ్రామ ప్రజలు ప్రయాణానికి పడుతున్న కష్టాలు తీర్చేందుకు, రోడ్డు ప్రమాదాల నివారణకు బ్రిడ్జి నిర్మాణం అవసరమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, చాలా మంది గ్రామస్తులు, ప్రయాణికులు మృత్యువాత పడటం, గాయాల పాలవుతున్నారని ఎమ్మెల్యే ఉన్నతాధికారులకు వివరించారు. ఈ నేపథ్యంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రూ.4 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే వివరించారు. త్వరలోనే కొమిరేపల్లి వద్ద నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని బ్రిడ్జి పూర్తయిన వెంటనే కొమిరేపల్లి, సీతంపేట, గుండుగొలను, శింగవరం గ్రామాల ప్రజలకు, ప్రయాణికులకు కష్టాలు తొలగనున్నాయని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పేర్కొన్నారు. కొమిరేపల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరుపై సీతంపేట సర్పంచ్ పరసా లక్ష్మీసుజాత కనకరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, కొమిరేపల్లి ఎంపీటీసీ పులవర్తి వరమణి, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ కార్యదర్శి పులవర్తి సంతోష్, నాయకులు దిలీప్, బాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ కమిటీల నియామకం

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు ఏలూరు నగర కమిటీ, నగర అనుబంధ కమిటీల్లో పలువురు నేతలకు పదవులు కేటాయిస్తున్నట్టు పార్టీ ఏలూరు నగర అధ్యక్షుడు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో వీరంతా పనిచేస్తారని చెప్పారు. పార్టీ ఏలూరు నగర సెక్రటరీలుగా బొడ్డేటి సుబ్బారావు, నవలవరపు నారాయణరావు, మైనార్టీ సెల్ ఏలూరు నగర సెక్రటరీగా షేక్ ఖాదర్ బాబా, బీసీ సెల్ ఏలూరు నగర సెక్రటరీగా కేజీవీఎస్ పుండరీకాక్షుడు నియమితులైనట్టు చెప్పారు.

ప్రజలకు సేవ చేయడం గొప్ప విశేషం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నగరంలో 48 సంవత్సరాలుగా హేలాపురి లయన్స్ క్లబ్ నిత్యం ప్రజలకు సేవ లందించడం గొప్ప విశేషమని ఏలూరు జిల్లా మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి.రాంగోపాల్ అన్నారు. హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం వికలాంగులకు కృత్రిమ కాళ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాంగోపాల్ మాట్లాడుతూ ప్రకృతి వలే నిస్వార్థంగా సేవలు అందించి తమ జన్మను సార్థకం చేసుకోవాలని సూచించారు. లయన్స్ జిల్లా ఉప గవర్నర్ కాకరాల వేణు బాబు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ క్లబ్బులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కేబీ రావు, కార్యదర్శి బొల్లా సత్యనారాయణ, కోశాధికారి డి.రమాదేవి, ప్రోగ్రాం చైర్‌పర్సన్ రావి పద్మకుమారి ఆధ్వర్యంలో సుమారు 100 మందికి కృత్రిమ కాళ్లు అందజేశారు. సుమారు రూ.6 లక్షల విలువచేసే కృత్రిమ కాళ్లను అందించిన నగరానికి చెందిన డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య కుమార్తె ప్రవాస ఆంధ్రులు డాక్టర్లు కె.హిమబిందు, కె.శ్రీనివాస ప్రసాద్ దంపతులను క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఖమ్మం రోటరీ క్లబ్ ప్రతినిధులు పి.రంగారావు, డి.సాంబశివరావు, లయన్స్ రీజియన్ చైర్మన్ వి.మల్లికార్జునరావు, జోన్ చైర్మన్ కుర్మా శ్రీనివాస్, పూర్వపు గవర్నర్లు డాక్టర్ యార్లగడ్డ జగన్మోహనరావు, వల్లూరుపల్లి మురళీ మోహనరావు, జిల్లా నాయకులు ఎల్ వెంకటేశ్వరరావు, దాసర గణేష్ బాబు, శానం మురళీకృష్ణ, వి.వెంకటేశ్వరరావు, దువ్వి హేమసుందర్ పాల్గొన్నారు.

ముగిసిన స్వరాంజలి కార్యక్రమం



ఘంటసాల పాటలు ఆలపిస్తున్న గాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ఘంటసాల సంగీత కళాశాల, హైదరాబాద్‌కు చెందిన గోవింద్ మల్టీ టాలెంట్ ఆర్ట్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతి సందర్భంగా శనివారం ప్రారంభమైన స్వరాంజలి కార్యక్రమం ఆదివారం ముగిసింది. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో రెండో కార్యక్రమంలో పలువురు గాయకులు సుమారు 100 పాటలను ఆలపించి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఘంటసాల సంగీత కళాశాల అధ్యక్షురాలు రేవతి రామ్‌కుమార్, లంకా వెంకటేశ్వర్లు, మనస్విని, టి.సాయి కుమార్, వి.రాజేష్ మీనన్, సీహెచ్ కల్యాణ్, డి.నరేష్ తదితర గాయకులు ఘంటసాల పాటలను శ్రావ్యంగా ఆలపించారు. గోవింద్ మల్టీ టాలెంట్ ఆర్ట్స్ సంస్థ అధినేత టి.గోవిందరావు సంగీత సారథ్యంలో వి.రామ్‌కుమార్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో హిందూ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాక్షేత్రం అధ్యక్షుడు బీవీ రామారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నంది అవార్డు గ్రహీత ఎండీ ఖాజావలీ పర్యవేక్షించారు.